# నేహాల



సాయిబ్రహ్మానందం గొర్తి

# చరిత్రకి బలైన స్వేచ్ఛ కథ

(గత సంచిక నుంచీ తరువాయి)

## 21

**దేవరాయల సైన్యం యుద్ధానికి వస్తోందన్న వార్త ఫిరోజ్‌షా చెవిన పడింది.** సైనికాధికారి ఫరూక్ వెనుదిరిగి వెళిపోదామన్నాడు. లేకుంటే ప్రాణాలకే ముప్పని వారించాడు.

పైగా ఈ ప్రదేశమంతా వీళ్ళకి కొత్త. రాయచూరు వరకూ గుట్టలూ, చిన్న చిన్న రాళ్ళతో ఉన్న ప్రదేశాలు వాళ్ళకి తెలుసు. దక్షిణానున్న భూమి ఎత్తైన పీఠభూమి. పెద్ద పెద్ద బండరాళ్ళతో అస్తవ్యస్తంగా ఉన్న ఆ ప్రదేశం చాలా వింతగా అనిపించింది. ఎటునుండి దారి ఉందో, ఎక్కడ ముగుస్తుందో చెప్పడం చాలా కష్టంగా అనిపించింది వాళ్ళకి. పైగా శత్రు రాజ్యం. ఏ వైపునుండి ఏ ముప్పు దాపరిస్తుందో పసిగట్టడం కూడా కష్టమే.

ఇదే విషయం ఫరూక్ ఫిరోజ్‌షాకి వివరించాడు. మర్నాడు వెనుదిరిగి వెళిపోదామనుకుని నిశ్చయించుకున్నాడు. అప్పటికే మరింత బలగాలని తరలించమని తమ్ముడికి వార్త పంపాడు. వాళ్ళు అప్పటికే బయల్దేరుంటే, వాళ్ళని రాయచూరు వద్దే ఆపేయమని చెప్పచ్చని అనుకున్నాడు. దేవరాయలు ఆనెగొంది కోటలోనే ఉన్నాడనీ, అక్కడ అంతగా సైన్యమున్నట్లుగా అగుపించలేదనీ, ఈలోగా ఒక వేగు వార్త మోసుకొచ్చాడు. పైగా ఆనెగొంది కోటకి అతి చిన్న ప్రహరీ తప్ప కట్టుదిట్టమైన రక్షణ అంతగా లేదు. దేవరాయలు తమ విడిది గృహంలా వాడుకుంటాడు.

ఆనెగొంది తుంగభద్రానదికి ఉత్తరాన ఉంది. నది దాటి వస్తే దక్షిణాన విజయనగరం ఉంది. పరవళ్ళు తొక్కే తుంగభద్రని దాటి విజయనగరంలో ప్రవేశించడమంత సులభం కాదు. అందుకే విజయనగర కోట విస్తీర్ణం పెంచాడు. కోట చుట్టూ అయిదు పెద్ద ప్రహరీలు నిర్మించాడు దేవరాయలు.

ఆనెగొంది కోటకి అంతగా రక్షణ లేదని తెలిసాక ఫిరోజ్ షాకి విజయకాంక్ష పెరిగింది. రాత్రికి రాత్రి ఆనెగొంది కోటని ముట్టడిస్తే దేవరాయల్ని హతమార్చవచ్చు. అంతే కాదు ఇదే విజయనగరాన్ని స్వాధీన పరుచుకోవడానికి సరైన సమయం అనుకున్నాడు. ఉన్న పళాన సైన్యాన్ని అప్రమత్తం చేసి, అర్ధరాత్రి దాటాకా ఆనెగొంది కోటని ముట్టడించడానికి సన్నాహాలు చేసాడు. తనూ, ఫరూక్ ఇద్దరూ సైన్యాన్ని నడిపించాలనీ, కొద్దిమంది సైన్యంతోనే ఈ దాడి చెయ్యాలనీ పథకం వేశాడు. మిగతా సైన్యాన్ని గంగావతికి ఉత్తరానున్న ఒడ్డెరహట్టి వద్ద ఒక ఖాళీ ప్రదేశంలో రాత్రికి వుండమని ఆదేశించాడు. ఫిరోజ్ షాకి ధైర్యంగానే ఉన్నా ఫరూక్కి మాత్రం భయం భయంగానే ఉంది. పట్టపగలే ఈ ప్రదేశం దుర్భేద్యంగా ఉంది. అలాంటిది రాత్రి పూట యుద్ధమని తలచుకుంటేనే అతనికి ఒళ్ళు గగుర్పుడిచింది. అయినా సుల్తాన్ మాటని కాదని చెప్పే ధైర్యం లేదు. అప్పటికే సైన్యాన్ని యుద్ధానికి సిద్ధంగా ఉండమని హుకుం జారీ చేసేసాడు ఫిరోజ్‌షా. గత్యంతరం లేని పరిస్థితుల్లో ఫరూక్ తలవంచక తప్పలేదు.

సైన్యానికి ఆహార సేకరణ అన్నింటికన్నా తలనొప్పి వ్యవహారంగా తయారయ్యింది. ప్రస్తుతం వరకూ ప్రజల్ని భయపెట్టీ, బెదిరించీ దండుకున్నారు. ఇలా ఎన్ని దినాలిక్కడ గడిపేదన్న బాధ అతన్ని దొలిచివేస్తూనే ఉంది. అహ్మద్‌ఖాన్‌కి ఎవరు తప్పుడు సమాచారమిచ్చారో

తెలీదు. రాయచూరులో మామూలుగా ఉండే సైన్యం కూడా లేదు. ఇక్కడ కూడా వారికి ఏ మాత్రమూ ప్రతిఘటన ఎదురవ్వ లేదు. అది చూసుకునే ఫిరోజ్‌షా ఇంతవరకూ వచ్చాడు.

చీకటి పడ్డాక ఫిరోజ్‌షా ఎవరేం చెయ్యాలీ, ఏదైనా కాని అవాంతరం ఒస్తే సైన్యం ఎలా వ్యవహరించుకోవాలీ వంటి జాగ్రత్తలూ మిగతా సైనికాధికారులకీ చెప్పించాడు. తమ వద్దున్న బాకులూ, కత్తులూ, శూలాలూ అన్నీ సిద్ధం చేసుకున్నాడు. గంగావతి ఊరు నిద్రలోకి సద్దుమణిగిందని అనిపించాకా ఆనెగొంది వైపుగా అయిదువందల మంది సైన్యంతో బయల్దేరాడు.

కానీ అప్పటికే దేవరాయలు కొంత సైన్యాన్ని ఆనెగొంది రప్పించమని కబురంపాడు. మర్నాడుదయమే అయిదువేల మంది పైగా సైన్య వస్తున్నట్లుగా వార్తొచ్చింది. తెల్లారాక గుల్బర్గా సుల్తానుల పని పట్టచ్చని అనుకున్నాడు. ఓ రాత్రి వేళ ఫిరోజ్‌షా ఆనెగొంది కోటని ముట్టడించేసరికి దేవరాయలు సైన్యం కంగారు పడింది. అప్పటికీ కొంతమంది సైన్యం అప్రమత్తమయ్యి ప్రతిఘటించారు. కానీ దేవరాయల సైన్యం ముందు ఆగలేకపోయారు. కొంత సేపు హోరా హోరీగా యుద్ధం సాగింది. దేవరాయల సైనికులు కొంతమంది మరణించారు. ఫిరోజ్‌షా ముట్టడి వార్త దేవరాయల్ని నిద్ర లేపి మరీ చెప్పారు. దేవరాయలు భార్యనీ, కూతుర్నీ సొరంగ మార్గం ద్వారా పంపిద్దామనీ, తనూ అక్కడనుండి పారిపోదామని సిద్ధమయ్యాడు. ఈలోగా సైన్యాన్ని వారితో ఎదుర్కో మనీ చెప్పాడు. ముందుగా భార్యనీ,కూతుర్నీ సొరంగ మార్గం ద్వారా పంపించేసి తను తన ఆయుధం తీసుకుందామని వెనక్కి వచ్చాడు. కానీ అప్పటికే ఫిరోజ్‌షా సైన్యం కోటని క్రమించుకున్నారు. అతి తక్కువ శ్రమతో ఆనెగొంది కోటలోకి ప్రవేశించాడు ఫిరోజ్‌షా. అక్కడున్న దేవరాయల సైన్యం ముందుకెళ్ళనీయకుండా అడ్డుకుంటూనే ఉన్నారు.

ఫిరోజ్‌షా సైన్యం ధాటికి తాట్టుకోలేక దేవరాయల సైన్యం పలాయనం చిత్తగించింది. దాంతో దేవరాయలు కోటలోనే చిక్కుకుపోయాడు. తనూ అక్కడున్న సైనికులతో హోరా హోరీ యుద్ధం చేశాడు.

దేవరాయల ప్రతిఘటన చూసి ఫిరోజ్‌షా సైన్యం సైనికాధికారి ఎవరో అనుకున్నారు. మిగతా సైనికుల్ని ఫిరోజ్‌షా సైన్యం దేవరాయల కళ్ళముందే హతమార్చారు. చివరకి దేవరాయలు వాళ్ళకి లొంగిపోయాడు. దేవరాయల్ని కొంత మంది సైనికులు తాళ్ళతో బంధించారు. అతని ఆయుధాలని స్వాధీన పరుచుకున్నారు.

దేవరాయల సైన్యాధికారిని పట్టుకున్నామని ఫిరోజ్‌షాకి వార్త వెళ్ళింది. పట్టుబడిన మిగతా సైనికుల్ని ఆరాతీసే వాళ్ళు పట్టుకున్నది సాక్షాత్తూ విజయనగర మహారాజునే అని తెలిసి గట్టిగా అరిచారు. ఫిరోజ్‌షా సైన్యం మొత్తం ఆ కోటలో ప్రవేశించారు.

దేవరాయల్ని ఫిరోజ్‌షా ముందు హాజరు పరచడానికి తీసుకొస్తున్నారు. ఈలోగా దేవరాయలు పట్టుబడ్డాడన్న వార్త తెలిసి హుటాహుటిన అక్కడున్న మందిరం వైపుగా వెళ్ళాడు ఫిరోజ్‌షా. కోట ద్వారం సమీపిస్తూండగా ఎటునుండి వచ్చాయో తెలీదు, రెండు బాణాలు బలంగా ఫిరోజ్‌షా భుజమ్మీద గుచ్చుకున్నాయి. గట్టిగా అరిచాడు. సైన్యం తేరుకొని అప్రమత్తమయ్యే లోపు మరో రెండు బాణాలు అతని చాతీలో గుచ్చుకున్నాయి. బాధతో గట్టిగా అరుస్తూ నేలకొరిగిపోయాడు ఫిరోజ్‌షా.

ఈ హఠాత్పరిణామానికి ఖిన్నులయ్యారు మిగతా సైన్యం. వేంటనే అక్కడ ఒక పక్కకి తీసుకెళ్ళి పడుకో బెట్టారు. బ్రతికే ఉన్నాడు కానీ, స్పృహతప్పాడని నిర్ధారించుకున్నాక అతనికి కాపలాగా కొంతమందిని ఉంచి, బందీ అయిన దేవరాయల్ని గుర్రమెక్కించి తమ స్థావరానికి తీసుకెళ్ళమని ఆజ్ఞాపించాడు ఫరూక్.

ఫిరోజ్‌షాకి విపరీతమైన రక్తస్రావం జరిగింది. అక్కడే ఉన్న సైనికులు రెండు చేతులకీ కట్లు కట్టారు. కొంతసేపయ్యాక, ఫిరోజ్‌షాకి ప్రాణహాని లేదని గ్రహించీ, తరువాత అక్కడనుండి అతి వేగంగా తమ స్థావరానికి తరలించారు.

దేవరాయలు పట్టుబడ్డాడన్న ఆనందం వాళ్ళకి క్షణంలో మాయమయ్యింది.

ఫిరోజ్‌షా తీవ్రంగా గాయపడడంతో హుతాశులయ్యారు అతని సైన్యం మొత్తమూ. ఒక్కడంటే ఒక్కడు కూడా ఆనెగొంది కోట వద్ద నిలువలేదు. సుల్తాన్ వెనుకే వెళ్ళారు.

000000000

దేవరాయలు గుల్బర్గా సైన్యానికి చిక్కాడన్నా వార్త దావానలంగా వ్యాపించింది. వేలకొద్దీ విజయనగర సైన్యం ఆనెగొంది వైపుగా తరలారు. ఆనెగొంది కోట తిరిగి వారి ఆధీనంలోకి వచ్చినా, దేవరాయల ఆచూకీ తెలియ లేదు. దేవరాయల్ని బందీగా తీసుకెళ్ళారనీ ప్రాణాలతో పారిపోయిన సైనికులు కొంతమంది చెప్పారు. తెల్లవారుతూండగానే దేవరాయల ముఖ్య మంత్రీ, సైనికాధికారీ ఆనెగొంది కోట వద్దకు వెళ్ళారు.

కోట దగ్గర దృశ్యం బీభత్సంగా ఉంది. అనేకమంది సైనికుల శవాలు అక్కడ పడున్నాయి. ఎక్కడ చూసినా రక్తపు మడుగులు. తెగిన తలలూ, మొండాలూ, చేతులతో ఆ ప్రదేశం హృదయవిదారకంగా ఉంది. భయం పుట్టించేలా ఉంది. దేవరాయల ముఖ్య మంత్రి మల్లప్ప కోట వద్దనున్న సైనికుల నుండి వివరాలు రాబడుతున్నాడు. గంగావతి ఉత్తరానున్న ఖాళీ ప్రదేశంలో చాలా సైన్యంతో ఫిరోజ్‌షా ఉన్నాడనీ తెలుసుకున్నాడు. అర్థరాత్రి ఆకస్మిక దాడికి కారణాలు తెలియ లేదు. అసలు ఎందుకీ యుద్ధం మొదలయ్యిందో కూడా అంతుపట్టలేదు. చారులూ, వేగులూ ఎవరూ కూడా ముందుగా సమాచారం తీసుకు రాలేదు. ఏం చెయ్యాలో మల్లప్పకి పాలుపోవడం లేదు. దేవరాయలు క్షేమంగా ఉన్నాడా లేక బందీగా చేసి అక్కడే హతమార్చారాన్నది తెలియ లేదు. సైన్యాన్ని గంగావతి వద్దకు తరలించాడు. ప్రధాన రహదారుల వద్ద నిఘా ఏర్పరిచి వేలకొద్దీ సైన్యాన్ని మోహరించాడు. విజయనగర కోట వద్ద భారీగా భద్రత ఏర్పాటు చేసాడు.

దేవరాయలు బందీ అయ్యాడని తెలిసి రాజకుటుంబం హుతాశులయ్యారు. నరేంద్ర గజపతికి విషయం తెలిసినా ఏం చెయ్యాలో పాలుపోలేదు. ఉమాదేభి భోరున విలపిస్తోంది. దేవరాయల్ని గుల్బర్గా సుల్తానుల హతమారిస్తే తమకిక్కడ ఏమ్మాత్రం స్థానముండదని అతను లోలోపల భయపడుతున్నాడు. దేవరాయల ఆంతరంగిక విషయాలలో నరేంద్ర గజపతినెవ్వరూ రానివ్వలేదు. అందువల్ల అతను ఉమాదేవి మందిరానికే పరిమితం అయ్యాడు.

మల్లప్ప మిగాతా రాజకుటుంబీకులతోనూ, ప్రధాన సైనికాధికారులతోనే ఏం చెయ్యాలన్న విషయం చర్చించాడు. గంగావతి వద్దనున్న ఫిరోజ్‌షా సైన్యంపై కనక యుద్ధం ప్రకటించి దాడి చేస్తే దేవరాయల్ని వాళ్ళు చంపేసే ప్రమాదముంది. ఒకవేళ అలాకాదని వాళ్ళని అక్కడ నిలువరించకపోతే విజయనగరం మొత్తానికే ప్రమాదం వచ్చే అవకాశముంది. ముందు దేవరాయలు బ్రతికున్నాడో లేదో తెలుసుకోవాలి. ఒకవేళ ఉంటే జాగ్రత్తగా వ్యవహరించి ఫిరోజ్‌షా వద్దనుండి అతన్ని తప్పించాలి. ఒకవేళ వాళ్ళ చేతుల్లో దేవరాయలు మరణిస్తే, అప్పుడు ఫిరోజ్‌షాని ఎదుర్కోవచ్చనీ అనుకున్నాడు. ఫిరోజ్‌షా గంగవతి ఉత్తరాన ఒద్దెరహట్టి సమీపంలో మకాం వేసాడు. అతన్ని నాలుగు మూలల్నుండీ చుట్టు ముట్టితే కానీ అతనిపై నెగ్గడం కష్టం. అందువల్ల కొంతమంది సైన్యాని కంపిలి మీదుగానూ, మరికొంత సైన్యాన్నీ ఆనెగొంది వైపుగానూ తరలించారు. అందరికీ ఒకే సూచన. తామంతట తాము ఎవర్నీ గాయపరచకూడదు. ఒకవేళ శత్రువు దాడి చేస్తే ఎదురుదాడి చెయ్యమని ఆదేశించాడు.

తుంగభద్రా నదీతీరం పొడవునా ఇరువైపులా సైన్యాన్ని మోహరించాడు. ఎట్టి పరిస్థితుల్లోనూ సుల్తాన్ సైన్యాన్ని విజయనగరం ప్రవేశం చెయ్యనివ్వ కూడదు. కొంతమంది వేగుల్ని సంప్రదించి ఎలాగయినా ఫిరోజ్‌షా ఉన్న చోటుకెళ్ళి దేవరాయల సంగతి తెలుసుకు రమ్మనమని పంపించాడు.

రాయచూరు పరిసర ప్రాంతాల్లో యుద్ధం గురించి వినడమే కానీ విజయనగరంపై ఎవరూ దాడి చేసిన దాఖలాలు లేవు. ఇంతవరకూ గుల్బర్గా సుల్తాన్ రావడంతో ప్రజలు భయభ్రాంతులయ్యారు. ఏం జరుగుతోందో ఎవరికీ అర్థం కావడం లేదు. స్త్రీలూ, పిల్లలూ భయంతో వణికి పోతున్నారు.

*0000000000000000*

రాత్రికి ఫిరోజ్‌షాని తమ స్థావరానికి తెచ్చినా అతనికి తగిలిన దెబ్బలకి తట్టుకోలేక విలవిల్లాడిపోతున్నాడు. ఎన్ని సపర్యలు చేసినా ఫిరోజ్‌షా మంచం మీదనుండి లేవలేకపోయాడు. తన మహల్లో అయితే వైద్యులొచ్చేవారు. ఏదో ఒక పసరు పూసి వైద్యం చేసేవారు. గుచ్చుకున్న బాణాలు వెలికి తీసినా అవి రెండు చేతుల వద్దా బలంగా లోతుగా గుచ్చుకున్నాయి. బాధ తట్టుకోలేక గట్టిగా అరుస్తున్నాడు. అతని దీనావస్థ చూసి సైనికాధికారి ఫరూక్కి ఏం చెయ్యాలో పాలు పోవడం లేదు. దేవరాయల్ని బందీగా తెచ్చామన్న ఆనందం కంటే ఫిరోషా పరిస్థితే అతన్ని కలవర పరిచింది. అతనూ మిగతా సైనికాధికారులని సమాయత్త పరిచాడు.

ప్రస్తుతం ఫిరోజ్‌షా కదిలే ఇక్కడనుండి కదిలే పరిస్థితుల్లో లేడు. ఎలాగయినా ఇక్కడనుండి తెలివిగా బయట పడాలి. లేదంటే దేవరాయల సైన్యం తమని ఒదిలి పెట్టదు. దేవరాయల్ని బందీగా కట్టి పడేయమనీ, ఏమాత్రం అతనికి హాని కలిగించవద్దనీ చెప్పాడు. ఇక్కడనుండి బయట పడాలంటే తమకున్న ఒకే ఒక ఆయుధం దేవరాయలు. కాబట్టి ఫిరోజ్‌షా కోలుకునే వరకూ దేవరాయల్ని అడ్డు పెట్టుకొని సమయం గడపాలి. ఈలోగా అహ్మద్‌ఖాన్ సైన్యం పంపిస్తే సరి. లేదంటే ఫిరోజ్‌షాని ఎవరికంటా పడకుండా గుల్బర్గా చేరేట్లు చూడాలి. ఈ వ్యూహంతోనే దేవరాయల కట్లు విప్పి ఒక గుడారంలో ఉంచాడు. చుట్టూ కాపలాగా వేయికళ్ళతో చూడమని సైన్యాన్ని పెట్టాడు. తమతో వచ్చిన ఒక సైనికాధికారికి మూలికా వైద్యం తెలుసు. గతంలో యుద్ధాలకి వెళ్ళినప్పుడు గాయపడిన సైనికులకి చికిత్స చేసేవాడు. అతనే ఫిరోజ్‌షాని పర్యవేక్షిస్తున్నాడు.

"సుల్తాన్ తేరుకోవడానికి ఎంత సమయం పడుతుంది?" ఫరూక్ వైద్యుణ్ణి ప్రశ్నించాడు.

"రెండు చేతులకీ చాలా పెద్ద గాయాలయ్యాయి. కనీసం లేచి తిరగాలంటే నాలుగైదు వారాలు పట్టచ్చు. విపరీతమన రక్తస్రావం జరగడం వల్ల అతనికి వంట్లో శక్తిలేదు. మాతో తెచ్చిన కొన్ని మూలికలు వేసి కట్టు కట్టాం. ఎంతలేదన్నా అతను లేచి తిరగడానికి చాలా కాలమే పట్టచ్చు," వైద్యుదు చెప్పాడు.

"అంటే కదిలే పరిస్థితిలోకి రావడానిక్కూడా సమయం పడుతుందా?" మరో సారి అడిగాడు ఫరూక్.

అవునన్నట్లు తలూపాడు. విశ్రాంతి తప్ప వేరే మార్గం లేదని చెప్పాడు. అంతవరకూ ఇక్కడ కాని ప్రదేశంలో ఎలా గడపాలన్నదే పెద్ద సమస్య అయ్యిందనీ తలపట్టుకున్నాడు ఫరూక్. ఫిరోజ్‌షా గాయపడిన విషయం వేగుల ద్వారా గుల్బర్గాకి పంపాడు.

'దేవరాయలు తమ వద్ద బందీగా ఉన్నాడన్న సంగతి ఎలాగయినా విజయనగర రాజులకి తెలియ చెయ్యాలి. వారితో దౌత్యం అంటూ సందేశాలు పంపాలి. యుద్ధం విరమించుకొని శాంతి ఒప్పందం చేసుకుందామన్న ప్రతిపాదన ఎలాగయినా విజయనగర రాజులకి అందచెయ్యాలని అనుకున్నాడు. తమ సైనికుల్లో కొంతమందిని ఈ వార్త గంగావతిలో పదిమందికీ చాటించమనీ చెప్పి పంపించాడు.

*00000000000000*

దేవరాయలు బ్రతికే ఉన్నాడన్న వార్త విని యావత్తు విజయనగరమూ సంతోషించింది. ముఖ్యంగా రాజకుటుంబమూ, మిగతా అధికారులూ ఊపిరి పీల్చుకున్నారు. కానీ ఇప్పుడు అతన్ని ఎలా విడిపించాలన్న మరో సమస్య తలెత్తింది మల్లప్పకి. కవ్వింపు చర్యలకి పాలుపడవద్దనీ సైన్యాన్ని ఒకటికి వందమార్లు గట్టిగా హెచ్చరించాడు. దేవరాయల్ని విడుదలచేసి తమకి అప్పగిస్తే రాయచూరుని వదులుకుంటామని చెప్పమని వర్తమానం పంపాడు. అంతగా కావాలంటే దేవరాయలు తిరిగొచ్చాక చూసుకోవచ్చని అతని ఉద్దేశ్యం. అతని

ప్రతిపాదనకి మిగతా అధికారులూ, రాజ కుటుంబీకమూ సరేనన్నాయి. తమ తరపున ఒక అధికారిని దౌత్యానికి నియమించీ, తమ మాటగా ఈ విషయం చెప్పమని పంపించాడు.

ఆ వెళ్ళిన వ్యక్తి వెళ్ళినట్లే వెళ్ళి తిరిగొచ్చాడు. విజయనగర రాజుల ప్రతిపాదన విన్నారనీ, ఆలోచించుకొని తమ వారితో సంప్రదించి చెబుతామనీ చెప్పమన్నట్లుగా వార్త మోసుకొచ్చాడు. సుల్తాను నిర్ణయం రెండు మూడు దినాల్లో చెబుతామన్నారనీ చెప్పాడు.

సరేననుకొని మల్లప్ప ఎదురుచూద్దామని నిశ్చయించుకున్నాడు. ప్రస్తుతం ఇంతకు మించి చేసేదేమీ లేదు. దేవరాయల ప్రాణం అతి ముఖ్యం. అతను అక్కడ నుండి బయట పడే వరకూ తొందరపాటు పడడం తమకే ముప్పని అతనికి తెలుసు. సరే, సుల్తాన్ ఫిరోజ్‌షా కబురు పంపే వరకూ వేచి చూద్దామనుకున్నాడు.

కానీ ఫిరోజ్‌షా సైనికాధికారి ఫరూక్ వ్యూహం వేరు. పైకి రెండు మూడు దినాలన్నాడు కానీ సుల్తాను కోలుకునే వరకూ చెప్పకూడదన్నది అతని నిర్ణయం. ఫిరోజ్‌షా ప్రస్తుతం బాధలో ఉన్నాడు. ఈ విషయాలేవీ చెప్పలేదు.

కాలం మెల్లగా కదుల్తోంది. వారం గడిచినా సుల్తాన్ ఫిరోజ్‌షా వైపునుండి ఎటువంటి సమాచారమూ లేక పోయేసరికి కంగారు మొదలయ్యింది మల్లప్పకి. రేపు రేపనుకుంటూ ఎదురుచూసాడు. అతనికి సుల్తాన్ వ్యూహమేవిటో ఎంత తలపగల కొట్టుకున్నా అర్థం కాలేదు. చేసేదేవీ లేక సహనం వహించాడు.

అతనే కాదు యావత్తు విజయనగరమూ ఎంతో ఉత్కంఠతో దేవరాయల కోసం ఎదురుచూస్తోంది.

*000000000000000*

మూడునాళ్ళ తరువాత ఫిరోజ్‌షా మెల్లగా కోలుకుంటున్నాడు. అసలేం జరిగిందన్నది అతనికి గుర్తు రాలేదు. ఫరూక్ ద్వారా అన్ని విషయాలూ తెలుసుకున్నాడు. తమ్ముడు అహ్మద్‌ఖాన్ నుండి సహాయం వచ్చే వరకూ ఇక్కడే ఉందామనీ చెప్పాడు. ఎంతో తెలివిగా దేవరాయల్ని బందీగా ఉంచడమొక్కటే తమకున్న ఏకైక మార్గమనీ ఫరూక్ని ప్రశంసించాడు. విజయనగర రాజుల ప్రతిపాదన కూడా తెలుసుకున్నాడు. రాయచూరు ప్రస్తుతం తమ ఆధీనంలోనే ఉంది. కాబట్టి దాన్ని మరలా వారికే తిరిగి ఇవ్వడమేవిటని చికాకు పడ్డాడు. అతనిక్కావలసింది రాయచూరు కాదు, విజయనగర సామ్రాజ్యం. తమ అంగీకారాన్ని చెప్పకుండా కొన్నాళ్ళు నానుద్దామనీ చెప్పాడు. ఒకసారి దేవరాయల్ని చూడాలని తనముందుకి హాజరు పెట్టమని ఆదేశించాడు.

మాసిన గెడ్డంతో ఉన్న దేవరాయల్ని సంకెళ్ళతో బంధించి ఫిరోజ్‌షా ముందు ప్రవేశ పెట్టారు. దేవరాయల్ని చూసి ఆశ్చర్యపోయాడు ఫిరోజ్‌షా. వయసు ఏభైయ్యో పడిలో పడ్డా తను అలా కనిపించడు. కానీ వయసులో తనకంటే పెద్దవాడయిన దేవరాయలు మధ్య వయస్కుళ్ళ కనిపించడం అతన్ని ఆశ్చర్యానికి గురిచేసింది. దేవరాయలూ ఫిరోజ్‌షాని చూడడం ఇదే మొదటి సారి. ఫిరోజ్‌షా చేతులకీ, భుజాలకీ కట్లు కట్టున్నాయి. మంచమ్మీదే పడుక్కుని ఉన్నాడు. అతని చూసి దేవరాయలూ ఆశ్చర్యపోయాడు. ఏమయ్యిందో, ఎం జరుగుతూందో అతనికీ అర్థం కాలేదు.

"దేవరాయా! నువ్వు ప్రస్తుతం మా బందీవి. నిన్ను విడిపిస్తే మాకు రాయచూరు ఇస్తానని చెప్పారు మీ వాళ్ళు. కానీ రాయచూరెవరిక్కావలి? నీ రాజ్యంలో సగం మాకిస్తేనే నిన్ను విడిపిస్తాం!" అంటూ చెప్పాడు.

ఫిరోజ్‌షా మాట్లాడే ఉర్దూ భాష దేవరాయలకి అర్థం కాలేదు. అర్థం కానట్లుగా చూసాడు. అక్కడే ఉన్న మరెవరో దేవరాయలకి ఫిరోజ్‌షా ఏమన్నాడో అనువాదం చేసి చెప్పారు. దేవరాయలు ఏం మాట్లాడ లేదు. ఏం చెప్పాలో కూడా తెలీలేదు. మరలా ఫిరోజ్‌షాయే అన్నాడు.

"నీకు మా ద్వారా ఎటువంటి ప్రాణ హానీ కలగదు. అదిమాత్రం హామీ ఇవ్వగలను. కానీ విజయనగరం మా ఆధీనమయ్యే వరకూ విడిచిపెట్టేది లేదు," అని చెప్పి అక్కడనుండి తీసుకెళ్ళమన్నట్లు చెయ్యూపాడు.

దేవరాయలు తలవంచుకునే వెనుదిరిగాడు. ఏ కారణం చేత ఫిరోజ్‌షా యుద్ధం ప్రకటించాడో అడుగుదామనుకున్నాడు. కానీ అడగలేదు. యుద్ధకాంక్షకీ, రాజ్యకాంక్షకీ కారణాలుండవు; ధ్యేయాలు తప్ప.

*000000000000000*

వారం గడిచినా సుల్తాన్నుండి ఏ కబురూ అందకపోయేసరికి కంగారు మొదలయ్యింది మల్లప్పకి. మరోసారి తమ దౌత్యాధికారిని పంపించాడు. ఈ వారంలో విజయనగర రాజ్యంలో ప్రతీ ప్రధాన పట్టణంలోనూ సైన్యాన్ని మోహరించాడు. రాయచూరు వైపు కూడా సైన్యాన్ని పంపాడు. ఫిరోజ్‌షా పంపిన వేగులు రాయచూరు వద్ద దేవరాయల సైన్యానికి చిక్కి వాళ్ళ చేతుల్లో మరణించారు. దేవరాయల సైన్యం రాయచూరుని ముట్టడించి తమ ఆధీనంలోకి తెచ్చుకుంది. అహ్మద్‌ఖాన్ సైన్యాన్ని రాయచూరు పంపుదామనుకునే లోపల దేవరాయల సైన్యం చేజిక్కడంతో రాయచూరు ప్రధాన రహదారులన్నీ మూసుకుపోయాయి.

అహ్మద్‌ఖాన్‌కి దిగులు మొదలయ్యింది. తను ముద్గల్ వైపు పంపిన సైన్యాన్ని వెనక్కి రప్పించాడు. ఫిరోజ్‌షా గురించి ఏ కబురూ అందలేదు. గంగావతి వద్ద అయిదు వేలమంది సైన్యంతో చిక్కుకు పోయాడన్న వార్త మాత్రం తెలిసింది. అన్నగారిని ఎలా విడిపించాలా అని పలువిధాలా ఆలోచిస్తున్నట్లు నటించాడు. పైకి అన్నగారి మీద ప్రేమ వ్యక్తం చేసినా అతను మరణిస్తే తనే గుల్బర్గా సుల్తాన్‌ణ కావచ్చన్న కాంక్ష అతనిది. ముద్గల్ వైపు పంపిన సైన్యాన్ని వెనక్కి రప్పించడంలో ఉన్న ఉద్దేశ్యమే అది.

జరిగిన పరిణామాలన్నీ గిసుదరాజుకి స్వయంగా విన్నవించాడు. గిసుదరాజు ఇది విని హుతాశుడయ్యాడు. అసలు ఫిరోజ్‌షా రాయచూరు దాటి ముందుకెలా వెళ్ళాడూ, ఎందుకు వెళ్ళాడో అర్థం కాలేదు. ఇంతవరకూ దేవరాయలే తమపై యుద్ధం ప్రకటిస్తున్నట్లుగా విన్నాడు. కానీ అదంతా ఉట్టిదేనని అర్థమయ్యింది.

"రాయచూరు మన ఆధీనంలోకి వచ్చిందని ఇంతకు ముందు కబురంపావు. మరలా అది తిరిగి దేవరాయల సైన్యం చేజిక్కిందా? అసలేం జరిగింది? జరుగుతోంది?" అంటూ అహ్మద్‌ఖాన్ని ప్రశ్నించాడు.

వేగుల ద్వారా వచ్చిన వార్త విని తనూ మోసపోయాననీ, ఇలా జరుగుతుందని ఊహించలేదనీ చెప్పాడు.

"మనం ఎలాగయినా సుల్తాన్ని ఇక్కడకి క్షేమంగా తీసుకురావాలి. ఏం చేస్తావో తెలీదు? వేంటనే దౌత్యం పంపు," అంటూ అహ్మద్‌ఖాన్ని ఆదేశించాడు. సరేనన్నట్లు తలూపాడు అహ్మద్‌ఖాన్.

వెళుతూ వెళుతూ గిసుదరాజు మరలా అన్నాడు.

"ఎవర్నో వద్దు. నేనే నా మౌల్వీలతో వెళతాను. మమ్మల్ని ఎవరూ ఏం చెయ్యరు. కాబట్టి నాకు వెళ్ళేందుకు ఏర్పాట్లు చెయ్యి."

"మీరెందుకు మౌల్వీ? కావాలంటే నేను వెళతాను," అహ్మద్‌ఖాన్‌కి గిసుదరాజు వెళ్ళడం ఇష్టం లేదు.

"చెప్పానుగా! ఏర్పాట్లు చెయ్యించు," అంటూ గిసుదరాజు మరోమాటకి అవకాశం ఇవ్వకుండా అక్కడనుండి కదిలాడు.

గిసుదరాజు మాటల్ని కాదనే ధైర్యమూ, శక్తీ అతనికి లేదు.

జరగాల్సింది జరగక మానదు. పైకి బాధ నటించినా అన్నగారు మాత్రం తిరిగి గుల్బర్గా రాకూడదనే మనసారా కోరుకున్నాడు.

కీర్తి కండూతీ, అధికార వాంఛనీ మించిన వ్యాధి ఈ ప్రపంచంలో మరొకటుండదు. అవి దరిదాపులకి రాకుండా చూసుకోవాలే కానీ, ఒక్కసారి ఆవహించాక ఓ పట్టాన వదలవు.

*0000000000000000*

చూస్తూండగా రెండు వారాలు గడిచిపోయాయి. సుల్తాన్ స్థావరం నుండి ఏ రకమయిన అంగీకారమూ రాలేదు మల్లప్పకి. రాయచూరు ప్రతిపాదన కుదర్దని మాత్రం చెప్పాడు. ఫిరోజ్‌షా ఇంకా రాయచూరు తమ ఆధీనంలోనే ఉందన్న భ్రమలో ఉన్నాడు.

అతనికి తిరిగి అది దేవరాయల సైన్యం హస్తగతమయ్యిందన్న సంగతి తెలీదు. తను విజయనగర సైన్య అష్టదిక్బంధంలో చిక్కుకున్నాడన్న విషయమే అతనికి తెలీదు.

ఏ విషయమూ తేల్చకుండా ప్రతీ సారీ ఏదో ఒక సాకు చెప్పి సాగదీస్తున్నాడు. ఒకసారి తమ సైన్యానికి ఆహారం కావాలనీ, మరో సారి వారికి ధనం కావాలనీ ఇలా అనేక ప్రతిపాదనలతో కాలం వెళ్ళబుచ్చుతున్నాడు. సైన్యానికి ఆహారం సరఫరా చెయ్యమన్నది మొదటి కోరిక. మల్లప్ప దానికీ అంగీకరించాడు. సైన్యానికి రెండు వారాలకి సరిపడా ఆహారమూ, దినుసులూ అందచేసాడు.

ఒక్కసారి దేవరాయల్ని కలిసే అవకాశం కల్పించమనీ కబురంపాడు. అది కుదరదని తిరిగి చెప్పించాడు ఫిరోజ్‌షా. ఇలా ప్రతీ చిన్న విషయానికీ ఇరు పక్షాల మధ్యా దౌత్యం జరుగుతోంది కానీ, ఒక్కడుగూ ముందుకెళ్ళడం లేదు.

దేవరాయల్ని బందీ విముక్తుణ్ణి చెయ్యడమే తమ ప్రధాన లక్ష్యం అన్నట్లుగా వ్యవహరించడంతో ఫిరోజ్‌షాకి అదే తనకున్న పెద్ద అవకాశమనీ భావించాడు. అతన్ని అడ్డుగా పెట్టుకొనే కథ నడిపించాలనీ ప్రయత్నిస్తున్నాడు. ఈలోగా తనూ మెల్లగా కోలుకుంటున్నాడు. ఇంకా మంచం దిగే పరిస్థితి రాలేదు. కాకపోతే నొప్పి తగ్గు ముఖం పట్టింది. అహ్మద్‌ఖాన్నుండి ఏ కబురూ అందకపోయేసరికి కంగారు మొదలయ్యింది అతనికి.

ఈలోగా రాయచూరు దేవరాయల వశమయ్యిందన్న కబురు వేగుల ద్వారా తెలిసింది. ఇక్కడనుండి ఇప్పుడెలా బయటపడాలాన్న ఆలోచన అతన్ని బాధిస్తోంది. తన వాళ్ళతో అనేకమార్లు చర్చించాడు. అందరి ఉద్దేశ్యమూ ఒక్కటే - దేవరాయలు తమ ఆధీనంలో ఉన్నంత వరకూ తమకి ఎటువంటి భయమూ లేదు. కాబట్టి దేవరాయలే తమ వద్దనున్న ప్రధాన పావు. యుద్ధ చదరంగంలో తమ వద్దనున్న ఏకైక శక్తి అదే! కాని అది తమకనుగుణంగా ఎలా ప్రయోగించాలాని తెగ తర్జన భర్జన పడుతున్నాడు.

అవకాశమున్నప్పుడల్లా దేవరాయల్ని విజయనగరంలో సగభాగం తమకివ్వమన్నది అతని ప్రతిపాదన. దేవరాయలు ఏనాడూ నోరు విప్పి ఏ ప్రతిపాదనా చెయ్యలేదు. కేవలం శాంతి ఒడంబడిక చేసుకుందామనే అన్నాడు. కానీ ఓ నాడు ఓ విచిత్రమైన ప్రతిపాదన తీసుకొచ్చాడు దేవరాయలు.

"శాంతి తప్ప మరో మార్గం లేదు. నాకు మీతో స్నేహంగానే ఉండాలని ఉంది. స్నేహం అంటే నమ్మకం కుదరకపోవచ్చు. కాబట్టి బంధుత్వం కలుపుకుందాం. నా కూతుర్ని నీకిచ్చి పెళ్ళి చేస్తాను. ఆ రకంగా మన మధ్య బంధుత్వం ఏర్పడుతుంది. మన ప్రజలకీ మంచి జరుగుతుంది," అని అన్నాడు.

దేవరాయలకి అక్కడనుండి ఎలాగయినా బయటపడాలన్నదే ధ్యేయం. సాధారణంగా సంగమ వంశీయులు తమ వంశీకులకే తప్ప వేరొకరికి పిల్లనివ్వరు. అటువంటిది తను తన కూతుర్నిచ్చి ఫిరోజ్‌షాని అల్లుడిగా స్వీకరించడానికి సిద్ధపడ్డాడు. ఈ వివాహం పేరు చెప్పి అనేక విలువైన బహుమతులూ, కట్నాలూ ఇస్తాననీ, రాయచూర్ని కూతురి కట్నంగా ముట్ట చెబుతాననీ, ప్రతీ ఏటా కొన్ని వందల వేల వరహాలు కానుకగా ఇచ్చేలా అంగీకారం కుదుర్చుకుందామనీ అడిగాడు.

ఇది విని ఫిరోజ్‌షా గట్టిగా నవ్వాడు. ఒక హిందూ స్త్రీని వివాహమాడడమన్నది తనెప్పుడూ ఎరగడు. కావాలంటే వాళ్ళతో ఓ రాత్రి గడపే వాళ్ళని చూసాడు. ఇలా కూతుర్ని ఇవ్వడం ఎక్కాడా వినలేదు. చూళ్ళేదు కూడా.

ఇందులో ఏదో తిరికాసుందని అనుమానపడి దాన్నీ తిరస్కరించాడు. ఇలా ఒకరి ప్రతిపాదన చెయ్యడమూ, మరొకరు తిరస్కరించడమూ తప్ప ఒక్కడుగు కూడా ముందుకు పడ లేదు. కాలమొక్కటే ముందుకెళుతోంది.

ఓ నాడు తమ స్థావరంలోకి ఎవరో బలవంతంగా చొరబడ్డారని సైనికులు ఓ ఇద్దరు వ్యక్తుల్ని పట్టుకున్నారు. వాళ్ళని బంధించి ఫరూక్ వద్దకి తీసుకొచ్చారు. తీరా చూస్తే వాళ్ళల్లో ఒకరు గిసుదరాజ్. తను సుల్తాన్ ఫిరోజ్‌షాని కలవడానికొచ్చాననీ చెప్పాడు.

అక్కడ గిసుదరాజ్ ప్రత్యక్షమవ్వడం ఆశ్చర్యానికి గురిచేసింది ఫిరోజ్‌షాని. అతని ద్వారా విషయాలన్నీ తెలిసాయి. రాయచూరు దేవరాయల ధీనంలోకి వెళ్ళిందనీ తెలుసుకున్నాడు. తను విజయనగర సైన్యం మధ్య చిక్కుకు పోయానన్న వాస్తవం అతనికి మింగుడు పోలేదు. ఎవరి కంటా పడకుండా ఎన్నో ప్రయాసలెదుర్కొని ఇక్కడికొచ్చామనీ గిసుదరాజ్ చెప్పాడు. ఫిరోజ్‌షా జరిగినదంతా పూసగుచ్చినట్లు చెప్పాడు.

"సుల్తాన్! మనం ఇక్కడనుండి ముందు బయటపడాలి. మనకి శాంతి మార్గం తప్ప మరొకటి లేదు. ఎన్నాళ్ళిలా ఇక్కడ ఇరుక్కుంటాం? మనం దేవరాయల్ని విడిచిపెట్టం. వాళ్ళు అతన్ని రక్షించే వరకూ మనల్ని ఇక్కడనుండి కదలనివ్వరు. ఒక వేళ యుద్ధమంటూ జరిగితే విజయనగర సైన్యం ముందు మనం నిలబడలేం. నాకయితే దేవరాయల ప్రతిపాదన నచ్చింది. నువ్వు వేంటనీ అతని కూతుర్ని వివాహమాడడానికి ఒప్పుకో! తద్వారా గుల్బర్గా వాసులకీ మంచి జరుగుతుంది. చూసి చూసి ఏ తండ్రీ పిల్లనిచ్చిన రాజ్యం పై దండెత్తడు. ఇది అన్ని విధాల అందరికీ శ్రేయస్కరం. మన ధనాగారానికీ కొంత వెలితి తీరుతుంది. వివాదాస్పదమయినా రాయచూరూ నీకు దక్కుతుంది. ఇంకేం ఆలోచించకు. నా మాట విను."

"ఒకవేళ మనం దేవరాయల్ని విడిచిపెట్టేక మనపై ఎదురు తిరిగితే?" అన్న అనుమానమొచ్చింది. ఇదే గిసుదరాజుతో అన్నాడు.

"నాకు దేవరాయలు మాట తప్పుతాడన్న అనుమానమయితే లేదు. అంతెందుకు, రాయచూరు విషయమే తీసుకో! వాళ్ళంతట వాళ్ళు ఎప్పుడూ మనపై దండెత్త లేదు. గతంలో జరిగిన రెండు యుద్ధాలకి మనమే కారణం. మనం రెచ్చగొడితేనే వాళ్ళు యుద్ధం చేసారు. రాయచూరు వివాదాస్పద ఒడంబడిక తరువాత వాళ్ళెప్పుడూ హద్దు మీర లేదు. ఇప్పుడు కూడా ఎవరో ఇచ్చిన తప్పుడు సమాచారం విని నీ తమ్ముడు చేసిన నిర్వాకం ఇది. ఇందులో నువ్వు కూడా సుల్తానులా వ్యవహరించలేదు. నీ తమ్ముడికున్న వేశం చూపించావు. కోరి కష్టాలు తెచ్చుకున్నావు. కొన్ని వారాల వరకూ నువ్వు ప్రయాణించే స్థితిలో లేవు. నువ్వు ఈ పెళ్ళికి ఒప్పుకుంటే నీకు రాచమర్యాదలు జరుగుతాయి. నువ్వు త్వరగా కోలుకునే అవకాశం వుంది. ఏదో ఒక వైద్యమయినా దొరుకుతుంది. ఎంతకాలం ఇలా ఉంటావు చెప్పు? ఇదంతా అమలు పరిచే వరకూ నేనూ నీతోనే ఉంటాను," గిసుదరాజు సవివరంగా చెప్పాడు.

ఆ మాటలు శ్రద్ధగా విన్నాడు. ఇంతకు మించి గత్యంతరం లేదనిపించింది.

ఇదే విషయం ఫరూక్తో అంటే - "సుల్తాన్! నాకూ ఇదే మంచిది అనిపిస్తోంది. అల్లుడిగా మీరు విజయనగరంలో ప్రవేశిస్తే రాజ్యాన్ని కొల్లగొట్టే అవకాశం వుంటుంది. ఇది ముందు ముందు మన గుల్బర్గా రాజ్యానికే మేలు చేస్తుంది. నాకూ ఇది తప్ప మరో మార్గం కనిపించడం లేదు," అని సెలవిచ్చాడు.

ఫిరోజ్‌షా ఆలోచనలో పడ్డాడు.

*00000000000000000*

**(కొనసాగింపు వచ్చేసంచికలో)**

Click here to share your comments on this serial